పల్లె పోరుకు సన్నద్ధం

- తేలిన పక్కా లెక్క
- గ్రామ పంచాయతీల తుది ఓటరు జాబితా విడుదల
- జిల్లాలో 3,65,832 మంది ఓటర్లు

హనుమకొండ, సెప్టెంబర్ 29 : పల్లె పోరుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలోని ఓటర్ల లెక్కను పక్కాగా తేల్చారు. శని వారం తుది ఓటరు జాబితాను వార్డుల వారీగా పంచాయతీరాజ్ అధికారులు విడుదల చేశారు. తుది జాబితా ప్రకారం 12 గ్రామీణ మండలాల్లోని 210 జీపీల్లో ఉన్న 1,896 వార్డుల్లో మొత్తం 3,65,832 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,78,824, మహిళలు 1,87,006, ఇతరులు ఇద్దరు ఉన్నట్లు వెల్లడించారు. కమలాపూర్ మండలంలో అత్యధికంగా 55,510 మంది, అత్యల్పంగా పరకాల మండలంలో 14,974 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. కాగా, ఈనెల 6న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించగా 361 వచ్చాయి. ఈ నెల 26వ తేదీలోగా అభ్యంతరాలను పరిశీలించి 28న ఓటరు జాబితాను విడుదల చేశారు. గతంలో జరిగిన తప్పులు మళ్లీ జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒకే కుటుంబ సభ్యులు ఆ గ్రామంలోని ఒకే పోలింగ్ స్టేషన్‌లో వచ్చేలా జాబితాను సిద్ధం చేసినట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	జీపీలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆత్మకూరు	16	13,758	14,565	–	28,323
భీమదేవరపల్లి	25	19,993	20,819	–	40,812
దామెర	14	10,473	11,138	–	21,609
ధర్మసాగర్	19	18,372	19,230	–	37,602
ఎల్కతుర్తి	20	15,696	16,343	–	32,039
హసన్‌పర్తి	15	11,485	11,917	01	23,403
ఐనవోలు	17	16,736	17,372	01	34,109
కమలాపూర్	24	27,016	28,494	–	55,510
నడికూడ	14	13,434	14,108	–	27,542
పరకాల	10	7,261	7,713	–	14,974
శాయంపేట	24	16,581	17,153	–	33,734
వేలేరు	12	8,019	8,156	–	16,175
మొత్తం	210	1,78,824	1,87,006	02	3,65,832

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, సెప్టెంబర్ 29 : వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నూతన మార్కెట్ కమిటీ కృషి చేయాలని పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు సమస్యల పరిష్కారమే ముఖ్య అజెండాగా పాలకవర్గం ముందు కుపోవాలని సూచించారు. పరకాల మార్కెట్ యార్డులో శిథిలావస్థలోని గోదాములను పరిశీలించి నూతన గోదాములు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, మున్సిపల్ చైర్పర్సన్ సోదా అనిత-రామకృష్ణ పాల్గొన్నారు.

పరకాల కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాని కుడా చైర్మన్ ఇనగాల

పరకాల కాంగ్రెస్‌లో లుకలుకలు మరోసారి బయటపడ్డాయి. కాంగ్రెస్ పార్టీ వర్గపోరుకు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం వేదికగా నిలిచింది. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించగా పలువురు కాంగ్రెస్ వాదులు అసహనం వ్యక్తం చేశారు. పదేండ్ల పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రస్తుత కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. దీంతో ఇనగాల హాజరు కాలేదని ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఏవిధంగా న్యాయం జరుగుతుందో అనే భయం కలుగుతున్నదని కొందరు సీనియర్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

కిట్స్‌లో కేయూ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, ప్రొఫెసర్ మల్లారెడ్డి

హసన్‌పర్తి, సెప్టెంబర్ 29 : కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ మెన్ (ఫేజ్-1) ఓపెన్ డయిల్, ప్లేఫిట్స్‌ను ఆదివారం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలు రెండు రోజులు నిర్వహిస్తామన్నారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ప్రొఫెసర్ వెంకయ్య పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఆదిలాబాద్, ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి 34 కళాశాలల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొంటునట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, ప్రసాద్, పీఆర్‌వో ప్రభాకరాచారి పాల్గొన్నారు.

సఖీ సేవలు వినియోగించుకోవాలి

అవగాహన కల్పిస్తున్న కేర్‌వర్కర్లు హరిత, వినీల

హసన్‌పర్తి, సెప్టెంబర్ 29 : సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎర్రగట్టుగుట్ట సమీపంలోని జాగృతి మహిళా జూనియర్ కళాశాలలో సఖీ వన్ స్టాప్ సెంటర్ కేర్ వర్కర్‌లు హరిత, వినీల శనివారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు. గృహహింస, విడిపోయే భార్యాభర్తలకు కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పోలీస్, వైద్యం సహాయంపై అవగాహన కల్పించారు. మహిళలు సమస్యలు ఉన్నట్లయితే 0870-2452112కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కొప్పూరు పరుపుల బండపై నూరుడు గుంతలు

నూరుడు గుంతలను చూపుతున్న ఎకో ట్రావెలర్ ప్రతాప్

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 29 : ఆనాటి కాలంలో రాజుల సైన్యం వారి కత్తులను పదును చేసేందుకు ఉపయోగించిన నూరుడు గుంతలను భీమదేవరపల్లి మండలంలోని కొప్పూరులో పరుపుల బండపై కనుగొన్నట్లు ఎకో ట్రావెలర్ ప్రతాప్ తెలిపారు. కొప్పూరులోని తాళ్ల వాగు అవతల ఉన్న తుమ్మల కుంటకు దగ్గరలో ఈ పరుపుల బండ ఉందన్నారు. ఈ బండపై అనేక నూరుడు గుంతలు ఉన్నాయని చెప్పారు. ఆదిమ మానవుడు సైతం రాతి గొడ్డళ్లను నూరుకోవడానికి ఈ గుంతలను ఉపయోగించేవారని తెలిపారు. పురావస్తు భాషలో ఈ గుంతలను గ్రూవ్స్ అంటారన్నారు. ఈ గ్రామ సమీపంలో 400 ఏళ్ల క్రితం నాటి కోటగోడలు మరో గుట్టపై ఉన్నాయని వెల్లడించారు. కోట గోడలు, నూరుడు గుంతలను గ్రామస్తులు పరిరక్షించాలని కోరారు.

'తనిష్క్'లో ఘనంగా వరల్డ్ హార్ట్ డే

డాక్టర్ సన్నత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తనిష్క్ నిర్వాహకులు

హనుమకొండ, సెప్టెంబర్ 29 : నక్కలగుట్టలోని టాటా తనిష్క్ జ్యువెలర్స్‌లో ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు ఆశా దీప్తి, లావణ్య, జనరల్ ఫిజీషియన్ ససత్ కుమార్‌ను సన్మానించారు. వైద్యులు మాట్లాడుతూ మిత ఆహారం, జీవన విధాన మార్పులతోనే గుండె జబ్బులను నివారించొచ్చన్నారు. వ్యాయామం చేయాలని, ధూమపానం, మద్యానికి దూరంగా ఉండాలని సూచనలు చేశారు. స్టోర్ బాధ్యుడు యశోద నారాయణరావు మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే వజ్రాభరణాల విలువపై 20శాతం వరకు, బంగారు ఆభరణాల మేకింగ్ చార్జీలపై 20శాతం ఆఫర్ ఉందని, పాత బంగారం మార్పిడిపై పూర్తి విలువ ఉందని వివరించారు.

పైసలు ఇవ్వు.. ఫొటో దిగు

- డబ్బులు ఇవ్వకపోతే పట్టించుకోని అధికారులు
- రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వసూళ్లు

నయీంనగర్, సెప్టెంబర్ 29 : పైసా ఇస్తేనే ఫొటో లేదంటే.. లేట్ ప్రాసెస్ అంటూ వచ్చే కష్టమర్లను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఫాతిమానగర్ వంద ఫీట్ల రోడ్డులోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తాము కొన్న ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన వారు మొదట డాక్యుమెంట్‌ను తయారు చేసుకుని సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదిస్తారు. ఆయన సంతకం చేసి డాక్యుమెంట్‌ను ఫీడింగ్ చేస్తారు. చివరగా ఫొటో వద్దకు పోగానే డబ్బులు ఇచ్చిన వారికే మొదటి ప్రాధాన్యత ఇచ్చి, లేదంటే ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఇంత తతంగం నడుస్తున్నా అధికారులకు తెల్వకుండా ఉంటుందా అంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫొటో తీసే కౌంటర్

ఫొటో కోసం ఎదురు చూస్తున్న రిజిస్ట్రేషన్ దారులు

శిథిలావస్థలో పశువైద్య కేంద్ర భవనం

పెద్దాపురంలో శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కేంద్రం భవనం

ఆత్మకూరు, సెప్టెంబర్ 29 : పెద్దాపురం గ్రామంలోని పశువైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. కేంద్రంలో విద్యుత్, తాగు నీటి సౌకర్యాలు లేవు. భవనం పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల గోడలన్నీ పదన ఎక్కాయి. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం 70 పశువులను వైద్యం కోసం రైతులు తీసుకొస్తుంటారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవనానికి నిధులు మంజూరు చేయాలని లేకపోతే వేరే గదుల్లోకి మార్చాలని వారు కోరుతున్నారు.

విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడండి

హనుమకొండ, సెప్టెంబర్ 29 : విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు అన్నారు. ఆదివారం హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ వరంగల్, హనుమకొండ జిల్లాల జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను బలహీనపరుస్తూ ప్రైవేట్ విద్య సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తున్నదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదన్నారు. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సూత్రపు అనిల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సుల్తానా, నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 29 : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం 10 నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. అయితే సాయంత్రం 6 గంటలు దాటినా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. దీంతో 2గంటలకు కరంటు వస్తదని పొలాల దగ్గరికి వెళ్లి నీళ్లు కట్టుకునే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అధికారులను అడిగితే 5, 10 నిమిషాలు అంటూ దాట వేసే సమాధానాలు చెప్పారు. దీంతో కరెంటు ఎప్పుడు వస్తదో తెలియక ఎండలోనే రైతులు బావుల దగ్గర కాపు కాశారు. ఎల్కతుర్తిలోని వ్యాపారులు, దుకాణదారులు సైతం కరెంటు లేక ఇబ్బంది పడ్డారు. ఈ విషయంపై ఏఈని వివరణ అడుగగా, అనుకున్న సమయానికి పని కాలేదని అందుకే సరఫరాలో ఆలస్యం జరిగిందని చెప్పారు.

OFFICE OF THE ASSISTANT DIRECTOR, HANDLOOMS AND TEXTILES, WARANGAL.

SHORT TENDER NOTICE

Rc No 135/2024-C Date : 29-09-2024

SEALED TENDERS are invited for installation of (60) stalls with octonium and laminated ply wood,Electrical fittings and Electrical lights and materials, wallposters, Banners, Handbills and pamphlets etc for the State Handloom Expo sponsored by DC for Handlooms, Ministry of Textiles, Government of India, New Delhi to be conducted at Hanumakonda from 08.10.2024 to 21.10.2024. The Details of the TENDERS/ QUATATIONS are available with the Assistant Director, Handlooms and Textiles, KLN Reddy Colony,Subedari, Warangal on payment of Rs 1000/- by way of DDs in favour of Assistant Director, Handlooms and Textiles, Warangal.The persons/ firms who are submitting their quotations should have at least (6) years of Experience in this field. Last date for submission of TENDERS/ QUATATIONS is 05.10.2024 up to 12.00 Noon at office of the Assistant Director, Handlooms and Textiles, KLN Reddy Colony, Subedari, Warangal. The tenders will be opened on the same day at 2.00 P.M.

Sd/- **ASSISTANT DIRECTOR Handlooms and Textiles**, Warangal.

యుద్ధప్రతిపాదికన మూడు, నాలుగో లైన్ పనులు

కాజీపేట, సెప్టెంబర్ 29 : కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎఫ్ క్యాబిన్ వద్ద ఆదివారం రైల్వే కార్మికులు చేపట్టిన మూడో, నాలుగో లైన్ రైలు పట్టాల గ్యాంగ్ వర్క్ పనులు యుద్ధప్రాతిపదికన నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి 14 గంటల పాటు చేపట్టిన మెగా బ్లాక్‌లో అన్ని విభాగాల అధికారులు, సికింద్రాబాద్ నుంచి వచ్చిన ఉన్నతాధికారులు, దాదాపు 500 మంది రైల్వే కార్మికులు శ్రమించారు. నూతన రైలు పట్టాలు, పాత పట్టాల మార్పిడీ, నూతన ఓహెచ్ఈ విద్యుత్ తీగల ఏర్పాట్లను కార్మికులు చేపట్టారు.కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ మీదుగా నడిచే అన్ని రైళ్లను నిలిపి వేశారు. డిప్యూటీ సీఈ సజ్జా భార్గవ్‌కృష్ణా, ఏడీఆర్ఎం రాజీవ్ కుమార్ గాంగ్లే ఉన్నారు.

రైలు పట్టాలను మార్చుతుస్తున్న సిబ్బంది

నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, సెప్టెంబర్ 29 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీకృష్ణారావు

డాక్టర్ కృష్ణారావు

వరంగల్, సెప్టెంబర్ 29 : హనుమకొండ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు-2గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆయనను ఎన్నుకున్నారు.

నేడు నందనంలో రూరల్ మార్ట్ ప్రారంభం

నేడు ప్రారంభం కానున్న ఎఫ్ఎస్‌సీఎస్ రూరల్ మార్ట్

ఐనవోలు, సెప్టెంబర్ 29 : నందనం రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో రెండో ఎఫ్ఎస్‌సీఎస్ రూరల్ మార్ట్ బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, సీఈవో కోతి సంపత్ తెలిపారు. నాబార్డు ఆర్థిక సహకారంతో గత సంవత్సరం మార్చి 18న మండల కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొట్టమొదటి రూరల్ సొసైటీ మార్ట్‌ను ప్రారంభించామన్నారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు చేతుల మీదుగా నందనం సొసైటీ భవనంలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌సీఎస్ మార్ట్‌ను ప్రారంభించనున్నారు.

మహిళ అదృశ్యం

చైతన్య (ఫైల్)

కాజీపేట, సెప్టెంబర్ 29 : కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకా రం.. మడికొండ, ఇందిరమ్మ కాలనీకి చెందిన మ్యాదరి వేణు కాజీపేట పట్టణం సోమిడికి చెందిన చైతన్య (35)ను 17ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. చైతన్య ఎక్కువగా మొబైల్‌లో టైం స్పెండ్ చేయడంతో ఈ నెల 26న మందలించాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్తానని చెప్పగా, వేణు బైక్‌పై సోమిడిలో దింపాడు. మరుసటి రోజు వేణు కుమారుడు అమ్మమ్మకు ఫోన్ చేసి తల్లి గురించి అడగ్గా, మీ నాన్న దింపిన అరగంటకే ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని చెప్పింది. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. వేణు పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన భార్య అదృశ్యమైందని వినతిపత్రం ఇచ్చాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై లవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

దామెర, సెప్టెంబర్ 29 : డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, నీరు రోజుల తరబడి నిల్వ ఉంచొద్దని, కొబ్బరిబోండాలు, కుళ్లిన చెత్తను గ్రామానికి దూరంగా పడేయాలన్నారు. దోమల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని సూచించారు.

లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

అనిల్(ఫైల్)

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 29 : ఆన్‌లైన్‌లో అప్పు లు తీర్చలేక మాడుగుల అనీల్(29)అనే యువకుడు పురుగుల మందు తాగి వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ముల్కనూరు గ్రామానికి చెందిన మాడుగుల అనీల్ డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఉపాధి కోసం వివిధ రకాల యాప్‌లు, బ్యాంకుల ద్వారా రూ.9లక్షల వరకు అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బులతో టాటా ఏసీ వాహనం కొని మొబైల్ టిఫిన్ సెంటర్‌ను భీమారంలో మొదలు పెట్టాడు. అయితే, అనుకున్నంతగా టిఫిన్ సెంటర్ నడవకపోవడంతో వ్యాపారం మానేసి ఇంటి వద్దనే ఉన్నాడు. రెండు నెలల క్రితం ముల్కనూరులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టాడు. ఇక్కడ కూడ షాప్ నడవకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. తీసుకున్న అప్పులు చెల్లించాలని ఫోన్ యాప్ నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి చేశారు. అప్పులు చెల్లించలేనని తీవ్ర మనస్తాపంతో ఈ నెల 28న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తల్లి వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై సాయిబాబు తెలిపారు.

ముురుగునీటి సమస్యను పరిష్కరించాలి

కాజీపేట, సెప్టెంబర్ 29 : రహ్మత్ నగర్ కాలనీలో నిల్వ ఉన్న ముురుగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. కాలనీలో నిల్వ ఉన్న ముురుగునీటి ప్రదేశాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ముురుగునీటి సమస్య ఎక్కువ కావడంతో ఎఫ్‌సీఐ అధికారులు గోదామ్‌కు ప్రహరీ నిర్మించడంతో ఎక్కడి ముురుగునీరు అక్కడే నిలిచిపోయిందన్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోయి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. బోర్లు, బావుల్లోని మంచినీరు కలుషితమవుతుందన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల ఎల్లేశ్, మునగాల భిక్షపతి, మాలోత్ శంకర్‌నాయక్, బొట్టు భిక్షపతి, పూర్ణచందర్, మంద కుమార్ పాల్గొన్నారు.

ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

ఆత్మకూరు, సెప్టెంబర్ 29 : మండలానికి ఒక 'ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్' ఏర్పాటు చేయాలని ప్రణాళిక ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అది మండలంలో ముందుకు సాగడం లేదు. ఇందిరా మహిళా శక్తి ఏర్పాటు కోసం రెండు నెలల క్రితం ఆత్మకూరు బస్టాండ్‌లోని షట్టర్లను మండల ప్రత్యేకాధికారి రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం లలితా దేవి పరిశీలించారు. కానీ ఇప్పటి వరకు క్యాంటీన్ ఏర్పాటుపై పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మండల కేంద్రంలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధిలో వివరాల్లేని బోర్డులు!

శాయంపేట, సెప్టెంబర్ 29 : ఉపాధి హామీలో పనుల చోట నేమ్ బోర్డులను తప్పనిసరిగా పెట్టాలి. కానీ కొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యం వల్ల బోర్డుల్లో వివరాలు అరకొరగా పెడుతూ వదిలేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పనిపేరు, నిధులు, ఎన్ని పనిదినాలు, ఎంత ఖర్చు, ఎన్ని రోజులు పని జరిగిందనే వివరాలను బోర్డుల్లో పేర్కొనాలి. ఇటీవల ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ జరిగింది. ఎక్కువగా పనుల చోట వివరాల బోర్డులు లేవన్న అంశాన్ని ఆడిట్ బృందాలు తేల్చాయి. శాయంపేటలో రైతువేదిక ముందు పెట్టిన ఉపాధి బోర్డు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నది.

47 ఏళ్ల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

శాయంపేట, సెప్టెంబర్ 29 : శాయంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 47 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. 1972 నుంచి 1977 వరకు ఆరు నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, యాదగిరి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయన్న, సర్వర్‌ను సత్కరించారు.

గౌడ విద్యార్థులు విద్యారంగంలో రాణించాలి

జ్ఞాపికలను అందజేస్తున్న గౌడ్ సంఘం బాధ్యులు

న్యూశాయంపేట, సెప్టెంబర్ 29 : గౌడ విద్యార్థులు విద్యారంగంలో రాణించాలని గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన 10 మంది విద్యార్థులకు గౌడ హాస్టల్ భవనంలో ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించి ఒక్కో విద్యార్థికి రూ.2వేల నగదును సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కౌండిన్య పరపతి సంఘం సహకారంతో అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, సెప్టెంబర్ 29 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేటలోని సిద్ధార్థనగర్‌లో నూతనంగా నిర్మించిన రాణీ రుద్రమదేవి మహిళా భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు అంటేనే రుద్రమదేవి పౌరుషం, పోటీతత్వం గుర్తుకు వస్తుందన్నారు. మహిళల కోసం రూ.22.60 లక్షలతో నూతన కమ్యూనిటీ భవనం నిర్మించామని, అన్ని కార్యక్రమాలకు వేదిక కావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, కాలనీ అధ్యక్షుడు వాసుదేవారెడ్డి, పాండు రంగారావు, చంద్రారావు, సత్యనారాయణ రావు, మహిళా గ్రూప్ నాయకురాళ్లు విజయలక్ష్మి, పుష్ప, భాను పాల్గొన్నారు.

కరాటేతో అనేక ప్రయోజనాలు

నయీంనగర్ : కరాటేతో చాలా ప్రయోజనాలు ఉంటాయని ఎమ్మెల్యే నాయిని అన్నారు. 58వ డివిజన్‌లోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా కియో జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించారు.